

అన్నప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నప్రసాద వితరణకు ఆదివారం పశ్చి మగోదావరి జిల్లాకు చెందిన ఎం.అనితాచార్యులు రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,611.79
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 41.326
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 9,713

న్యూస్‌రీల్

రక్షిత నీటిని అందించాలి



కిట్ ద్వారా నీటి క్లోరినేషన్‌ను పరిశీలిస్తున్న డీపీఓ భాస్కర్

కర్నూలు(అర్బన్): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నీటి ట్యాంకుల ద్వారా రక్షిత మంచి నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి జీ భాస్కర్ కోరారు. ఆదివారం కర్నూలు మండలం గార్గేయపురం ఎస్ఎస్ ట్యాంకును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు కలుషితమైతే ప్రజలు అనేక రకాల వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రతి 15 రోజులకు ఒకసారి ఖచ్చితంగా ఓహెచ్ఎస్ఆర్, జీఎల్ఎస్ఆర్‌లను శుభ్రం చేయాలన్నారు. అనుమానం వచ్చిన నీటిని తాగకుండా ప్రజలకు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు ఆ నీటిని టెస్టింగ్ కోసం ల్యాబ్‌కు పంపాల్సి ఉందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను సమన్వయం చేసుకొని నీటి సరఫరాపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

భూ సంరక్షణకు రూ.2.70 కోట్లు మంజూరు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖ భూసంరక్షణ విభాగానికి నిధులు విడుదల అయ్యాయి. ఉమ్మడి జిల్లాకు రూ.2.70 కోట్లు మంజూరు కాగా.. ప్రస్తుతం రూ.1.34 కోట్లు విడుదల అయ్యాయి. కర్నూలు జిల్లాకు రూ.1.50 కోట్లు మంజూరు కాగా.. మొదటి విడత కింద రూ.74.53 లక్షలు మంజూరు అయ్యాయి. నంద్యాల జిల్లాకు రూ.1.20 కోట్లు మంజూరు కాగా మొదటి విడతలో రూ.59.60 లక్షలు విడుదల అయ్యాయి. ఈ నిధుల్లో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరిస్తాయి. ఆర్‌కేవీవై కింద వర్షాధార ప్రాంతం (ఆర్‌ఏడీ) అభివృద్ధికి ఈ నిధులు వినియోగిస్తున్నట్లుగా భూసంరక్షణ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. వ్యవసాయంలో రైతుల సామర్థ్యాలను పెంచడం, భూమి అభివృద్ధి తదితర వాటికి ఈ నిధులు వినియోగించడం జరుగుతుందన్నారు. కర్నూలు డివిజన్ కల్లూరు మండలం బొల్లవరం, కే.మార్కాపురం గ్రామాలు, ఆదోని డివిజన్‌లో బైచిగేరి, బసలదొడ్డి గ్రామాలు, నంద్యాల జిల్లా డోన్ మండలం యు.కొత్తపల్లి, ఎర్రగుంట్ల గ్రామాల్లో ఆర్ఏడీ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఒక రైతుకు ఆర్‌కేవీవై కింద రూ.30 వేల విలువ ఇన్‌పుట్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో రైతుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు.

యూరియాపై పచ్చ పెత్తనం!



అధికార పార్టీ నాయకులు బరితెగిస్తున్నారు. ప్రతీది రాజకీయం చేస్తున్నారు. చివరకు అన్నదాతలకు అవసరమైన యూరియాను సైతం వదలడం లేదు. అధికార బలంతో రైతు సేవా కేంద్రాల(ఆర్‌బీకే)ను తమ అధీనంలోకి తీసుకొని యూరియాపై ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నారు. తమకు అనుకూలమైన వారికి మాత్రమే అందించి మిగతా వారిపై వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి బస్తా కూడా ఇవ్వడం లేదు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే వేధింపులు, దౌర్జన్యాలకు దిగుతున్నారు. ఆగడాలు భరించలేక బండిఆత్మకూరు మండలంలో ఓ రైతు ఆత్మహత్యకు యత్నించాడు. క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే పట్టించుకోవాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. డిమాండ్‌కు తగ్గట్టు యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం చేతులెత్తేయడమే దీనికంతటికి ప్రధాన కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి.



సంతజూటురు గ్రామంలో యూరియా పంపిణీలో పోలీసులతో పాటు అధికారపార్టీ నాయకులు

- అధికారపార్టీ నేతల చేతుల్లో యూరియా
- అనుకూలమైన వారికి, టీడీపీ కార్యకర్తలకే పంపిణీ
- వైఎస్సార్‌సీపీ ముద్రతో సామాన్య రైతులకు మొండిచేయి
- నంద్యాల జిల్లాలో 14 టన్నుల యూరియా కేవలం 15 మందికే పంపిణీ
- ప్రశ్నించే వారిపై కేసులతో వేధింపులు
- యూరియా సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇప్పటివరకు రబీ సాగు 2,45,466 హెక్టార్లు	
అవసరమైన యూరియా	ప్రభుత్వ సరఫరా చేసింది
1,47,279 టన్నులు	61,985 టన్నులు మాత్రమే

కర్నూలు(అగ్రికల్చర్)/బండిఆత్మకూరు: ఉమ్మడి కర్నూలు జిల్లాలో రబీ సాధారణ సాగు 2,82,247 హెక్టార్లు కాగా ఇందులో కర్నూలు జిల్లాలో 1,10,386, నంద్యాల జిల్లాలో 1,71,861 హెక్టార్లు. ఇప్పటి వరకు ఈ రెండు జిల్లాలో 2,45,466 హెక్టార్లు సాగైంది. కేసీ కెనాల్, తెలుగు గంగ కాల్వలకు నీరు సమృద్ధిగా వస్తుండటంతో నంద్యాల జిల్లాలో 1,61187 హెక్టార్లలో పంటలు వేశారు. ఇందులో వరి సాధారణ సాగు 27,908 హెక్టార్లు ఉండగా.. ఇప్పటికే 34,940 హెక్టార్లలో సాగు అయింది. అంటే 7 వేల హెక్టార్లకుపైగా అదనంగా సాగు అయింది. మరో ఆరేడు వేల హెక్టార్లలో సాగు అయ్యే అవకాశం ఉంది. అయితే, ఈ సాగు విస్తీర్ణాన్ని అంచనా వేయడంలో వ్యవసాయ యంత్రాంగం విఫలమైంది. దీనికితోడు డిమాండ్‌కు అనుగుణంగా యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది.

అంతంత మాత్రంగానే యూరియా సరఫరా

నంద్యాల జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 63,911 టన్నుల యూరియా వచ్చింది. అయితే, 53,417 టన్నుల యూరియా అమ్మకాలు జరిగాయి. రబీ సీజన్‌కు సంబంధించి యూరియా ఓపెనింగ్ బ్యాలెన్స్ 10 వేల టన్నులు ఉంది. ప్రస్తుతం నంద్యాల జిల్లాకు 37,483 టన్నులు మాత్రమే వచ్చింది. ఓపెనింగ్ బ్యాలెన్స్‌తో కలిపితే రబీ సీజన్‌కు మొత్తం 47 వేల టన్నుల యూనియా వచ్చినట్లు అవుతోంది. అయితే, నీటిపారుదల సదుపాయం ఉండటంతో ఇక్కడ సాధారణం కంటే 15 వేల హెక్టార్ల వరకు ఎక్కువగా పంట సాగు అవుతోంది. దీనిని అధికారులు అంచనా వేయకపోవడంతో బండిఆత్మకూరు, వెలుగోడు, నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు, శిరువెళ్ల, కోవెలకుంట్ల, అవుకు మండలాల్లో యూరియా కొరత తీవ్రంగా వేధిస్తోంది.

14టన్నుల యూరియా 15 మందికే...

నంద్యాల జిల్లాలోని ఒక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి నాలుగైదు రోజుల క్రితం 30 టన్నుల యూరియా ఇచ్చారు. ఇందులో 14 టన్నులు 15 మందికే పంపిణీ అయింది. ఈ యూరియా పొందిన వారికి భూములు కూడా పెద్దగా లేవు. ప్రస్తుతం సాగు చేస్తున్న దాఖలాలు కూడా లేవు. డిమాండ్‌కు తగ్గ సప్లై లేని సమయంలో 14 టన్నుల యూరియా 15 మంది టీడీపీ నేతల వశం కావడం పలు విమర్శలు తావు ఇస్తోంది. ఇదిలా ఉంటే నంద్యాల జిల్లాలో ఒకే ఒక్క ర్యాక్ పాయింట్ ఉండగా అక్కడ టీడీపీ నేతలే ఉంటున్నారు. దీనిని బట్టి ర్యాక్ పాయింట్ మొదలు గ్రామస్థాయి వరకు పచ్చపార్టీ నేతలదే పెత్తనం సాగుతుందని చెప్పవచ్చు.

అధికార పార్టీ బరితెగింపు



ఇక్కడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతు పేరు చిన్న పుల్లయ్య. బండిఆత్మకూరు మండలం చిన్నదేవళాపురం. ఇతను 16 ఎకరాల్లో వరిసాగు చేశాడు. ఈనెల 14వ తేదీన రైతు భరోసా కేంద్రం వద్ద యూరియా కోసం వెళ్లి క్యూలో నిలబడ్డాడు. టీడీపీకి చెందిన కొందరు నేరుగా వెళ్లి ఎరువులు తీసుకుంటుండడంతో ఇదేమి న్యాయమని ప్రశ్నించగా దాడి చేశారు. తరువాత వారే పోలీసులకు ఫిర్యాదు చేసి పుల్లయ్యపై కేసు పెట్టించారు. అరెస్టు చేసేందుకు పోలీసులు ఏకంగా గ్రామానికి వెళ్లారు. పొలంలో ఉన్న పుల్లయ్యకు ఈ విషయం తెలిసి తీవ్ర ఆందోళనకు గురై పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు.

హైజాక్ చేస్తున్న అధికార పార్టీ నేతలు

యూరియా కొరతను టీడీపీ నేతలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ప్రస్తుతం నంద్యాల జిల్లాకు వచ్చే యూరియాలో 50 శాతం మార్క్‌ఫెడ్‌కు, మిగిలిన 50 శాతం ప్రైవేటు డీలర్లకు ఇస్తున్నారు. మార్క్‌ఫెడ్ నుంచి రైతుసేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లకు వెలుతున్న యూరియా మొత్తాన్ని టీడీపీ నేతలే హైజాక్ చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 45 కిలోల బస్తా ధర రూ.267 ఉండగా.. టీడీపీ నేతలు తమ కంట్రోల్‌లో ఉంచుకొని రూ.400 వరకు అమ్మకాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితి ప్రధానంగా బండిఆత్మకూరు, వెలుగోడు, మహానంది, ఆత్మకూరు మండలాల్లో ఎక్కువగా ఉంది. డిమాండ్ ఉన్నప్పుడు మార్క్‌ఫెడ్ ప్రైవేటు డీలర్లకు యూరియా ఇవ్వరాదు. అయితే రాజకీయంగా ఒత్తిడి చేసి మార్క్‌ఫెడ్ నుంచి ప్రైవేట్ డీలర్లకు కూడా యూరియా ఇస్తున్నారు. తర్వాత ఆ ఎరువు కూడా టీడీపీ నేతల పరం అవుతోంది.

అధిక ధర చెల్లించి తెచ్చుకున్నాం



యూరియా కోసం అనేక ఇబ్బందులు పడుతున్నాం. మాకు సొంత భూమి 5 ఎకరాలు ఉండగా.. 20 ఎకరాలు కౌలుకు తీసుకున్నాం. మొత్తం వరి సాగు చేశాం. ప్రస్తుతం వరి పొట్ట, కంకిదశలో ఉంది. యూరియా వాడితే బాగా వస్తుంది. కాని ఎక్కడా యూరియా బస్తా కూడా లభ్యం కావడం లేదు. చివరికి నందికొట్కూరులో బస్తా రూ.380 ప్రకారం తెచ్చుకున్నాం. బస్తాకు రూ.400 ఇస్తామన్నా లభించడం లేదు. కొంతమంది మాత్రం అవసరమైన స్థాయిలో తెచ్చుకుంటున్నారు. అదే స్థాయిలో సామాన్య రైతులకు అందని పరిస్థితి ఉంది. యూరియా బంగారం అయింది. రానున్న రోజుల్లో బస్తా రూ.500 ప్రకారం అమ్ముతారనే ఆందోళన ఉంది.

– మురళీకృష్ణ, రైతు, బండి ఆత్మకూరు

సాగు పెరగడంతోనే యూరియా కొరత



నంద్యాల జిల్లాలో రబీలో వరిసాగు భారీగా పెరిగింది. సాధారణ సాగు కంటే దాదాపు 15 వేల హెక్టార్లు అధికంగా వరి సాగు అవుతోంది. దీంతో కొరత తీవ్రమైంది. నిబంధనల ప్రకారం ఎకరాకు రెండు.. రెండున్నర బస్తాల వరకు మాత్రమే యూరియా ఇవ్వాల్సి ఉంది. కాని చాలా ఎక్కువ తీసుకుంటున్నారు. 14 టన్నుల యూరియా 15 మంది రైతులు తీసుకున్నట్లు సమాచారం ఉంది. వీరికి భూములు ఉన్నాయా లేదా అనే దానిని చూస్తున్నాం. మరి కొద్ది రోజుల్లో 3,000 టన్నుల యూరియా వస్తుంది. అప్పుడు కొరత నుంచి బయటపడతాం.

– మురళీకృష్ణ, డీఏఓ, నంద్యాల

కర్నూలు జిల్లాకు అరకొరనే...

జిల్లాలో నీటిపారుదల సదుపాయం అంతంతమాత్రంగా ఉండటంతో లేట్ రబీ సీజన్ కింద వరి సాగు తక్కువగా ఉంది. హాలహర్వి, కౌతాళం, హొళగుంద, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పెద్దకడబూరు తదితర మండలాల్లో ఎల్లెల్సీ కింద వరి సాగు ఉంది. జిల్లాలో 84,279 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. 29,517 టన్నుల యూరియా అవసరం కాగా 24.502 వేల టన్నులు వచ్చింది. ప్రస్తుతం జిల్లాలోని ప్రైవేట్ డీలర్ల దగ్గర యూరియా లభించని పరిస్థితి. మార్క్‌ఫెడ్‌లో కూడా 500 టన్నులు మాత్రమే అందుబాటులో ఉంది. ఆదోని, ఎమ్మిగనూరు, పెద్దకడబూరు, కౌతాళం, మంత్రాలయం ప్రాంతాల్లో బస్తా యూరియా ధర రూ.350 పైనే అమ్మకాలు సాగిస్తున్నారు. పీఏసీఎస్‌లు, రైతు సేవా కేంద్రాల ద్వారా కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో కొందరు రైతులు కర్ణాటకకు వెళ్లి తెచ్చుకుంటున్నట్లు సమాచారం.



నవ మాసాలు గర్భంలో నన్ను భద్రంగా చూసుకుంటే సంతోష పడితిని..
కానీ ప్రపంచానికి అనాథగా పరిచయం చేస్తావనుకోలేదు.
పుట్టిన క్షణమే నీ వెచ్చని ఒడిలో లాలిస్తావని ఆనందపడితిని..
కానీ రక్తపు మరకలు ఆరక ముందే తల్లి ప్రేమకు దూరం చేస్తావనుకోలేదు.
భూమి మీదికి చేరగానే మీ బంధుత్వాన్ని చూపిస్తావని సంబరపడితిని..
కానీ బతికుండగానే కన్నపేగును తెంచుకుంటావనుకోలేదు.
ఆడ బిడ్డగా పుట్టాననో, లేక ఏ కష్టమొచ్చి నన్ను దూరం చేసుకున్నావో తెలియదు..
ఆ దేవుడి దయతో నేను క్షేమమే అమ్మా!

ఏ కొమ్మ రెమ్మనో!



ఐసీడీఎస్ సిబ్బందికి శిశువును అప్పగిస్తున్న వైద్య సిబ్బంది

అది జీనేపల్లె ఎస్సీ కాలనీ. ఆదివారం తెల్లవారుజామున అప్పుడప్పుడే జనం నిద్ర లేచి పనుల్లోకి వెళ్తున్నారు. చర్చి సమీపంలోని ఖాళీ ప్రదేశంలో ఓ శిశువు ఏడుపు వినిపించడంతో స్థానిక మహిళలు వెళ్లి చూశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆడ శిశువును అక్కడ వదిలేసినట్లు గుర్తించారు. శిశువు శరీరంపై రక్తపు మరకలు ఉండటంతో అప్పుడే పుట్టిన బిడ్డగా నిర్ధారించారు. గ్రామ ఆశా కార్యకర్తలు వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వడంతో యర్రగుంట్ల పీహెచ్‌సీ సీహెచ్‌ఓ నాగార్జున రెడ్డి గ్రామానికి చేరుకుని శిశువును పరిశీలించారు. వెంటనే 108లో నంద్యాల వైద్యశాలకు తరలించారు. వైద్య పరీక్షలు అనంతరం శిశువును నంద్యాలలోని శిశు గృహం సిబ్బందికి అప్పగించారు. – శిరివెళ్ల

పేకాట.. కాసుల వేట!

- దర్గాగా కూటమి నేత జూదం నిర్వహణ
- అనుమానం రాకుండా స్థావరాల మార్పు
- ఎంట్రీ ఫీజు రూ. 2 వేలు
- 'గ్లాసు' మంచినీళ్లు, కార్డులు మాత్రమే ఉచితం
- అప్పులు ఇచ్చేందుకు వడ్డీ వ్యాపారులు అక్కడే తిష్ట
- జూద కూపంలో మునిగి సర్వం కోల్పోతున్న వ్యసనపరులు



ఆదోని అర్బన్: 'రండి బాబూ రండి.. ఆటాడుకోండి.. మీ అదృష్టాన్ని పరీక్షించుకోండి' అంటూ పేకాటరాయుళ్లకు కూటమి నేత ఆఫర్ ప్రకటిస్తున్నాడు. అధికారం మాదే.. అడ్డుకునేదెవరంటూ దర్జాగా పట్టణ నడిబొడ్డున జూద స్థావరాలు నిర్వహిస్తూ రూ. లక్షలు ఆర్జిస్తున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదోని పట్టణంలో మూడు పార్టీల నేతలు అక్రమార్జనపై దృష్టి సారించారు. ఇప్పటికే కొందరు నాయకులు డీలర్‌షిప్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితర కాంట్రాక్ట్ పోస్టులు ఇప్పిస్తామని రూ. లక్షలు వసూలు చేయగా, ఇందులో ఒక నేత అందరి కంటే ఒక అడుగు ముందుకేశాడు. పట్టణంలో పేకాట స్థావరాలను నిర్వహిస్తూ నా రూటే సపరేటు అంటున్నాడు. పట్టణంలోని ఓ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగుచోట్ల ప్రాంతాలు మార్చి గ్యాంబ్లింగ్ (అందర్‌బహర్) ఆడిస్తున్నట్లు తెలిసింది. రోజుకు రూ. లక్షలు చేతులు మారుతున్నాయి. ఉదయం పూట ఆట ఆడిస్తే రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో అందరికీ తెలుస్తుందని మధ్యాహ్నం 3 గంటలకు ఒక షో ప్రారంభించి సాయంత్రం 5 నుంచి 6 గంటల్లో ముగిస్తారు. రెండో షో రాత్రి 8 నుంచి 9 గంటలకు మొదలెట్టి 11 గంటలలోపు ముగిస్తున్నారు. ఆట ఆడాలంటే ముందుగా ఎంట్రెన్స్ రుసుం రూ.2 వేలు కట్టాల్సిందే. ఒక షోకు ఇలా 15 నుంచి 20 మంది వరకు ఆటగాళ్లు వస్తున్నారు. ఇలా రోజుకు రెండు షోలు కలిపి మొత్తం రూ. 80 వేల వరకు కూటమి నేత జూద నిర్వహణలో సొమ్ము చేసుకుంటున్నాడు. రూ. వేలు తీసుకుని పేకాటరాయుళ్లకు కేవలం 'గ్లాసు' నీళ్లు, పేకాట కార్డులు సమకూర్చుతున్నట్లు తెలుస్తోంది. ఓ లాడ్జిలో నిర్వహించే స్థావరం పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఉంది. మరో ప్రాంతం బైపాస్ రహదారి వద్ద, ఇంకోటి కూటమి నేత స్వగృహం వద్ద, మరొకటి నిర్మాణంలో ఉన్న భవనంలో ఆడిస్తున్నారు.

అక్కడికక్కడే అధిక వడ్డీకి అప్పులు..

పేకాట స్థావరాల వద్ద డబ్బులు పోగొట్టుకున్న వారికి మళ్లీ అదృష్టాన్ని పరీక్షించుకోండి అంటూ అక్కడే వడ్డీ వ్యాపారులు డబ్బులు చేతపట్టుకుని ఆశ పెడతారు. అప్పటికప్పుడు రూ. 30 వేల నుంచి రూ. 50 వేల వరకు అప్పులిచ్చే వ్యక్తులే అక్కడే ఉంటున్నారు. వీరి వద్ద కొందరు ఇప్పటికే రూ. లక్షల్లో అప్పు చేసినట్లు తెలుస్తోంది. అధిక వడ్డీలకు అప్పులు తీసుకున్న పేకాట రాయుళ్లు తిరిగి చెల్లించేందుకు ఆస్తులు తాకట్టు పెడుతున్నారు. ఈ జూద కూపంలో మునిగిన వారిలో కొందరు బంగారు నగలు, ఇళ్ల స్థలాలు అమ్ముకున్నట్లు తెలుస్తోంది.

జూద గృహాల వైపు కన్నెత్తి చూడని పోలీసులు

ఆదోని పట్టణంలో గత రెండు నెలలుగా ఎక్కడ చూసినా పేకాట స్థావరాల చర్చ జరుగుతోంది. కూటమి నేతనే ఈ స్థావరాలను నడుపుతున్నట్లు పోలీసులకు తెలిసినా అటు వైపు ఎందుకు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి. సంబంధిత కూటమి నేత ఓ పోలీసు అధికారితో నెల మామూళ్లు ఇచ్చేలా డీల్ చేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో జూద స్థావరాలపై ఎవరూ దాడులు చేయడం లేదు.

18 నుంచి లాంగ్వేజ్ ఫెస్టివల్స్

కర్నూలు కల్చరల్: జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు లాంగ్వేజ్ ఫెస్టివల్స్ నిర్వహించాలని డీఈఓ శామ్యూల్ పాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్ఎస్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 18న ఇంగ్లిష్, 19న సంస్కృతం, హిందీ, ఉర్దూ, 20న గిరిజన బాషా, కన్నడ, తమిళం, ఒరియా, 21న తెలుగు బాషా ఉత్సవాలను నిర్వహించాలని తెలిపారు. ఆదోని డివిజన్ పరిధిలో కన్నడ భాషాకృత్యాలను నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు పఠన పోటీలు, కథ చెప్పడం లాంటి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఈ నెల 21 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ కార్యక్రమాలు పండుగలా నిర్వహించాలని పేర్కొన్నారు.

మల్లన్నకు నృత్యనీరాజనం



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై ఆదివారం విజయవాడకు చెందిన నర్తన డ్యాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. గణపతి ప్రార్థన, శివాష్టకం, శివోహం, శంకర శ్రీగిరివాసా తదితర గీతాలకు, అష్టకాలకు.. సత్యశ్రీ, భవ్య, లహరి తదితరులు నృత్యం ప్రదర్శించారు.

పునర్జన్మ నమ్మకాలపై ఆధారం

- ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి



సీనియర్ వైద్యులను సన్మానిస్తున్న కేఎంసీ అలుమ్ని బృందం సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): మనిషికి పునర్జన్మలు ఉన్నాయా లేదా అనేది వ్యక్తుల నమ్మకాలపై ఆధార పడి ఉంటాయని, ఆ నమ్మకం మనిషిలో తృప్తి మిగిలిస్తుందని, అదే లేకపోతే మనిషిలో అసంతృప్తి పెరిగిపోయి జీవించినంత కాలం కుంగుబాటుకు గురవుతారని విజయవాడకు చెందిన ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి చెప్పారు. కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం(అలుమ్ని) ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించిన నిరంతర వైద్య విజ్ఞాన సదస్సు, అలుమ్ని మీట్ ఆదివారం ముగిశాయి. ఈ కళాశాలలో చదివి దేశ,విదేశాల్లో స్థిరపడిన ప్రముఖ వైద్యులు స్పెషాలిటీ, సూపర్‌స్పెషాలిటీ అంశాలపై సబ్జెక్టుల్లో ఆధునిక వైద్యవిధానాలు, అభివృద్ధి గురించి వివరించారు. పునర్జన్మలు – నమ్మకాల గురించి డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడారు. పునర్జన్మలపై కొన్నేళ్లుగా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నా సరైన ఫలితాలు కనిపించడం లేదన్నారు. పునర్జన్మలపై తీసిన సినిమాలు మాత్రం సూపర్‌హిట్ అవుతున్నాయని, దీనిని బట్టి మనుషులకు వాటిపై ఎంతటి నమ్మకం ఉందో అర్థం అవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు మల్లికార్జున గోఖలే, సదాశివారెడ్డి, సంపత్, ప్రసాద్‌బాబు, గణేష్, చందనారెడ్డి, డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, డాక్టర్ నరసింహులు, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కుమారస్వామిరెడ్డి, సెక్రటరి డాక్టర్ బాలమద్దయ్య, ట్రెజరర్ డాక్టర్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల
(స్వయం ప్రతిపత్తి), కర్నూలు
ఇంజనీరింగ్ విద్యలో రాయలసీమకే తలమానికంగా నిలిచిన
జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభించి నలభై వసంతములు పూర్తి చేసుకున్న
శుభసందర్భంగా మమ్మల్ని ఆదరిస్తున్న విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదములు.
రూబీ జూబిలీ వేడుకలు - 2025
విజ్ఞాన మేళా - 4.0
(తరగతులను దాటి విజ్ఞానాన్ని చేరదీసే శాస్త్ర సాంకేతిక ప్రదర్శన) 17, 18, 19 ఫిబ్రవరి 2025.
ఈ విజ్ఞాన మేళా నందు శాస్త్ర సాంకేతిక పురోగతిని ఆవిష్కరించే మోడల్స్,
ఎంటర్‌టైన్‌మెంట్, ఫన్, ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయబడినవి.
అందరూ ఆహ్వానితులే..
ప్రవేశం ఉచితం.
సమయం : ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు
రండి – వీక్షించండి – ఆనందంతో కూడిన విజ్ఞానాన్ని పొందండి.

రైలు ప్రయాణం రయ్..రయ్

- రైలు ప్రయాణానికే ప్రయాణికుల మొగ్గు
- నంద్యాల–ఎర్రగుంట్ల రైల్వే మార్గంలో తగ్గని రద్దీ
- ప్రతి రోజు డెమో హౌస్‌ఫుల్
- బోగీలు పెంచాలని బలపడుతున్న డిమాండ్

చార్జీలు తక్కువనో, క్షేమంగా గమ్యం చేరుకోవచ్చనో ఏమో కానీ రైళ్ల ప్రయాణానికే ప్రజలు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. దీంతో నంద్యాల–ఎర్రగుంట్ల రైల్వే మార్గంలో ప్రయాణికుల రద్దీ పెరిగిపోతోంది. రోజూ నడిచే డెమో కిక్కిరిసిపోతోంది. ఫలితంగా బోగీలు పెంచాలనే డిమాండ్ ప్రయాణికుల నుంచి రోజురోజుకూ పెరిగిపోతోంది.


కోవెలకుంట్ల రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కుతున్న ప్రయాణికులు


రేణిగుంట డెమో రైలు బోగీలో కిక్కిరిసిన ప్రయాణికులు

కోవెలకుంట్ల: ఉమ్మడి కర్నూలు– వైఎస్సార్ జిల్లాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు నంద్యాల నుంచి వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల వరకు 130 కిలో మీటర్ల రైల్వేలైన్ ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ఉప్పలపాడు, నొస్సం, సంజామల, కోవెలకుంట్ల, బనగానపల్లె, మద్దూరు ప్రాంతాల్లో రైల్వేస్టేషన్లు ఉన్నాయి. రెండు జిల్లాల ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 2016 ఆగస్టు నుంచి ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. నంద్యాల నుంచి చిత్తూరు జిల్లా రేణిగుంట వరకు డెమో, అనంతపురం జిల్లా ధర్మవరం నుంచి రాష్ట్ర రాజధాని అమరావతి మీదుగా మచిలీపట్నం వరకు, గుంటూరు నుంచి తిరుపతికి ప్రతి రోజు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు ఆయా జిల్లాల పారిశ్రామిక అభివృద్ధికి గూడ్స్ రైళ్లు తిరుగుతున్నాయి. ప్రయాణికులకు రైలు ప్రయాణం మరింత సులభతరం చేసేందుకు రూ.50 కోట్లతో విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. 2023 మార్చి 29 నుంచి ఈ మార్గంలో విద్యుత్ రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. డీజిల్ ద్వారా నడిచే రైలు ప్రయాణం కంటే విద్యుత్ రైళ్లతో ప్రయాణం వల్ల సమయం ఆదా అయి త్వరగా గమ్యస్థానాలు చేరుకుంటుండటంతో ప్రజలు రైలు ప్రయాణం వైపు మొగ్గు చూపుతున్నారు.

తిరుపతి రైలుకు తగ్గని రద్దీ

నంద్యాల–ఎర్రగుంట్ల మార్గంలో 2022 ఆగస్టు 18 నుంచి గుంటూరు నుంచి తిరుపతికి ఎక్స్‌ప్రెస్ రైలు నడుస్తోంది. గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం, గిద్దలూరు, నంద్యాల, బనగానపల్లె, ప్రొద్దుటూరు, కడప, రాజంపేట, రేణిగుంట రైల్వేస్టేషన్లలో మాత్రమే ఎక్స్‌ప్రెస్ రైలు ఆగేది. రెండు జిల్లాల ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల అభ్యర్థన మేరకు నంద్యాల జిల్లా కోవెలకుంట్ల, వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు రైల్వేస్టేషన్లలో స్టాపింగ్ ఏర్పాటు చేశారు. తిరుపతి వెంకన్నస్వామి దర్శనానికి రైలు ప్రయాణం దగ్గరి మార్గం కావడంతో అదనంగా జనరల్ బోగీలు ఏర్పాటు చేయాలని ఆయా జిల్లాల ప్రయాణికులు రైల్వేశాఖ అధికారులను కోరుతున్నారు

కిక్కిరిసిపోతున్న డెమో రైలు

నంద్యాల–ఎర్రగుంట్ల రైల్వే మార్గంలో మొదట్లో నంద్యాల ఉంచి కడప వరకు డెమో రైలు నడిచేది. రైలు రాకపోకలు ప్రారంభమైన కొన్ని నెలలకు రైలును కడప నుంచి అదే జిల్లా పెండ్లిమర్రి వరకు పొడగించారు. ప్రయాణికుల సౌకర్యార్థం గత ఏడాది నుంచి చిత్తూరు జిల్లా రేణిగుంట వరకు రైలు సేవలను విస్తరించారు. నంద్యాల నుంచి ప్రతి రోజు ఉదయం 6.30 గంటలకు రైలు బయలుదేరుతుండటంతో నంద్యాల, బనగానపల్లె, కోవెలకుంట్ల, సంజామల, వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట తదితర ప్రాంతాల ప్రజలకు రైలు ప్రయాణం సులభతరంగా మారింది. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులకు అనువైన సమయం కావడంతో రైలు ద్వారానే రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం వెళ్లేందుకు సాయంత్రం తిరిగి ఇళ్లకు చేరుకునేలా రైలు నడుస్తుండటంతో ప్రతి రోజు డెమో రైలు ప్రయాణికులతో కిక్కిరిసి పోతోంది. నంద్యాల మొదలుకుని చిత్తూరు జిల్లా రేణిగుంట వరకు రైలు బోగీలు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులతో పాటు ఆయా జిల్లాల్లోని వివిధ ముఖ్య పట్టణాలకు బస్సు ప్రయాణం కంటే రైలు ప్రయాణం దగ్గరి మార్గం కావడంతో ఆయా పట్టణాల్లో బంగారు ఆభరణాలు, వస్త్ర వ్యాపారాల నిమిత్తం ప్రజలు, వ్యాపారాలు రైలు ప్రయాణం సాగిస్తున్నారు. ప్రతి రోజు బోగీల్లో సీట్లు నిండిపోయి నిలబడి ప్రయాణాలు సాగిస్తున్నారు. డెమో రైలుకు కనీసం రెండు బోగీలు అదనంగా ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మరికొన్ని రైళ్లు నడపాలని ప్రతిపాదన

కేంద్ర మాజీ హోం సహాయ మంత్రి, బిహార్, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్‌గా పనిచేసిన సంజామల వాసి దివంగత పెండేకంటి వెంకటసుబ్బయ్య కలల సాకారమైన నంద్యాల–ఎర్రగుంట్ల రైల్వే మార్గంలో రైళ్ల రాకపోకలు క్రమంగా పెరుగుతున్నాయి. రాకపోకలు ప్రారంభమైన మొదట్లో నంద్యాల నుంచి కడప వరకు వారంలో ఆరు రోజులు డెమో రైలు నడిచేది. తర్వాత ఆరు నెలలకు ధర్మవరం నుంచి రాష్ట్ర రాజధాని అమరావతికి వారంలో మూడు రోజుల మాత్రమే ఎక్స్‌ప్రెస్ రైలు తిరిగేది. 2018 నుంచి డెమో రైలును వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి వరకు పొడిగించడంతోపాటు ఎక్స్‌ప్రెస్ రైలుతో సహా రెండు రైళ్లు ప్రతి రోజు నడిచేలా రైల్వే అధికారులు చర్యలు తీసుకున్నారు. వీటితో పాటు రెండేళ్ల నుంచి తిరుపతికి ఎక్స్‌ప్రెస్ రైలు నడుస్తోంది. అలాగే ఉత్తర భారదేశానికి రైలు కనెక్టివిటిని విస్తరించేందుకు 2020వ సంవత్సరం నుంచి ఈ మార్గంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రైలు నడపాలని ప్రతిపాదన ఉండేది. ఆ ఏడాది కరోనా వైరస్ విజృంభించడంతో ఆ ప్రతిపాదనను రైల్వే అధికారులు రద్దు చేశారు. తిరిగి ఈ ప్రతిపాదనపై రైల్వే శాఖ దృష్టి సారించింది. రాబోయే రోజుల్లో ఈ రైలు పట్టాలెక్కితే నంద్యాల, ఉమ్మడి వైఎస్సార్ జిల్లాల ప్రజలకు రైలు ప్రయాణం మరింత చేరువకానుంది. ఈ రైలుతోపాటు నంద్యాల–ఎర్రగుంట్ల మార్గంలో మరిన్ని రైళ్లను నడిపేందుకు కేంద్ర రైల్వేశాఖ కసరత్తు చేస్తుండటంతో ఆయా జిల్లాల ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మరిన్ని రైళ్లు నడపాలి



నంద్యాల–ఎర్రగుంట్ల రైల్వే మార్గంలో ప్రస్తుతం ప్రతి రోజు ఒక డెమో, రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. డెమో రైలు ఉదయం, ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాత్రి వేళల్లో రోజులో ఒకసారి మాత్రమే తిరుగుతున్నాయి. బస్సు ప్రయాణాలకంటే రైలు ప్రయాణం చేసేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆయా జిల్లాల ప్రయాణికుల సౌకర్యార్థం ఎక్స్‌ప్రెస్ రైళ్లు పగటి వేళల్లో నడపటంతోపాటు మరిన్ని రైలు సర్వీసులను ఏర్పాటు చేయాలి. డెమో రైలుకు కూడా అదనపు బోగీలు ఏర్పాటు చేయాలి

– దస్తగిరి, సౌదరదిన్నె, కోవెలకుంట్ల మండలం

క్లుప్తంగా

భార్య డబ్బులివ్వలేదని భర్త బలవన్మరణం

నందికొట్కూరు: మద్యం తాగేందుకు భార్య డబ్బులివ్వలేదని బైరెడ్డి నగర్‌కు చెందిన బోయ నాగన్న(37) ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. రామచంద్ర తెలిపిన వివరాలు.. నాగన్న కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో ఆదివారం మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని భార్య వరలక్ష్మిని కోరగా లేవని చెప్పి ఆమె బయటకు వెళ్లింది. తిరిగి వచ్చేలోపే ఉరికి వేళాడుతూ కనిపించాడు. కుటుంబ సభ్యులు కిందకు దించి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఆటో చోరీ

డోన్ టౌన్: పట్టణంలోని తారకరామనగర్‌కు చెందిన తిక్కయ్య తన ఆటోను ఇంటి బయట పార్కు చేసి ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి అపహరించుకెళ్లారు. ఆదివారం ఉదయం బాధితుడు నిద్ర లేచి చూడగా ఇంటి బయట ఆటో కన్పించక పోవడంతో చుట్టుపక్కల గాలించాడు. ఎలాంటి సమాచారం లభించకపోవడంతో చోరీకి గురైనట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తిక్కయ్య తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని ఎస్.చెన్నంపల్లెలో బోయ అంజి(39) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాలు.. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అంజి కుటుంబ పోషణ భారం కావడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మధుసుప్రియ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

190 కోళ్లు మృతి

గడివేముల: మండల కేంద్రంలోని పలు చికెన్ దుకాణల్లో ఆదివారం కోళ్లు మృతి చెందాయి. నాలుగు చికెన్ సెంటర్లు ఉండగా రెండు రోజుల క్రితం ఓ చికెన్ సెంటర్‌లో 120 కోళ్లు, మరో చికెన్ సెంటర్‌లో 70 కోళ్ల దాకా మృతి చెందడంతో ఆ సెంటర్లను మూసివేశారు. బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్ తినేవారి సంఖ్య తగ్గడంతో మిగతా దుకాణాలు కూడా బోసిపోయాయి.

దళితులను విడగొట్టేందుకు కుట్ర


కరపత్రాలను విడుదల చేస్తున్న మాల జేఏసీ నేతలు

కర్నూలు(అర్బన్): దేశంలో ఓటు బ్యాంకు రాజకీయాలు, దళితులను విడగొట్టేందుకు కుట్రలు జరుగుతున్నాయని మాల మహానాడు వ్యవస్థాపకులు, స్వర్గీయ పీవీ రావు సోదరుడు, మాజీ ఐడీఏఎస్ అధికారి పీఎస్ఎన్ మూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ఓ హోటల్‌లో మాల జేఏసీ ముఖ్య నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది ఆగస్టు 1న ఎస్సీ ఉప వర్గీకరణకు సంబంధించి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు రాజ్యాంగబద్ధత లేదన్నారు. దేశంలోని ఏపీ, తెలంగాణ, పంజాబ్, హర్యాణ, తమిళనాడు రాష్ట్రాలు మినహా మిగిలిన 24 రాష్ట్రాలు ఈ తీర్పును వ్యతిరేకిస్తున్నాయన్నారు. సుప్రీం తీర్పు అనంతరం ప్రాంతీయ సమస్యగా ఉన్న ఈ అంశం ప్రస్తుతం జాతీయ సమస్యగా మారిందన్నారు. ఈ తీర్పు వల్ల దేశ వ్యాప్తంగా 30 లక్షల మంది దళితులు రోడ్డు పైకి వచ్చారన్నారు. ఒక కులాన్ని జాబితాలో చేర్చాలన్నా, తొలగించాలన్నా కేవలం పార్లమెంట్‌కు మాత్రమే అధికారం ఉందన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 23న కర్నూలులో, మార్చి 23న తిరుపతిలో రాయలసీమ మాలల యుద్ధ గర్జన సభలు నిర్వహిస్తున్నారన్నారు. మాలలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం యుద్ధ గర్జన కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో మాల జేఏసీ నేతలు గోన నాగరాజు, మాధవస్వామి, పి.రాజీవ్‌కుమార్, నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


గురుపుర్యురాలిని సన్మానించుకున్న రామళ్లకోట హైస్కూల్ పూర్వ విద్యార్థులు

వెల్దుర్తి: రామళ్లకోట జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పాఠశాల 1981–82 పదవ తరగతి బ్యాచ్‌తోపాటు 1977 నుంచి 82 వరకు చదువుకున్న చుట్టుపక్కల గ్రామాల వారు సమావేశానికి హాజరయ్యారు. 42 ఏళ్ల తర్వాత కలుసుకున్న బాల్య స్నేహితులందరూ ఒకరినొకరు చూసుకుని ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్య, వైవాహిక, ఉద్యోగ జీవిత విశేషాలు, కుటుంబ నేపథ్యాల గురించి ఒకరికొకరు తెలుసుకుంటూ ఆత్మీయంగా గడిపారు. తమకు చదువు చెప్పిన నాటి ఉపాధ్యాయురాలు సుశీలమ్మను సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. నిర్వాహకులుగా సురేంద్రనాథ్, రాముడు, చిన్నయ్య, దస్తగిరి, మియ్యాబాష, లలిత, రామస్వామి వ్యవహరించారు.

తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శిగా చంద్రశేఖర్



కోసిగి: ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శిగా కోసిగికి చెందిన చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. ఆదివారం ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మధురలో జరిగిన ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం మహాసభల్లో తనను జాతీయ కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు కోసిగికి చెందిన సీనియర్ తపాలా ఉద్యోగి డి.చంద్రశేఖర్ తెలిపారు.

రాష్ట్రస్థాయికి 22 మంది క్రీడాకారుల ఎంపిక


బహుమతులతో క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక నంది ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో 22 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు బ్యాడ్మింటన్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వంశీధర్ తెలిపారు. విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరు ఈనెల 21న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అనంతరం క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శేషిరెడ్డి, కోచ్ నాగార్జున పాల్గొన్నారు.

సమాజ హితానికి రచనలు దోహద పడాలి


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు, నరసం ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: సమాజ హితానికి రచనలు దోహద పడాలని, యువ రచయిత్రులు, కవయిత్రులు సాహిత్య రచన చేసేందుకు ముందుకు రావాలని పలువురు సాహితీ వేత్తలు, వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) వార్షికోత్సవంలో ప్రముఖ భాషా వేత్త డాక్టర్ జీవీ పూర్ణచంద్, సాహితీ వేత్త కురాడి చంద్రశేఖర కల్కూర, క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నరసం రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మీకళావతి, కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ, ఒరిస్సా బరంపురం సాహితీ వేత్త తుర్లపాటి రాజేశ్వరి మాట్లాడారు. రచయిత్రులు సమకాలీన అంశాలపై రచనలు చేసి సమాజానికి ఇతోధికంగా సేవలందించాలన్నారు. నరసం ఏర్పాటు అయ్యాక అనేక సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తూ తెలుగు భాషకు, సాహిత్యానికి విశేష కృషి చేయడం అభినందనీయమన్నారు. కుటుంబం బాగుంటేనే సమాజం బాగుంటుదన్నారు. కుటుంబంలో ప్రతి ఒక్కరు ఒకరికొకరు గౌరవించుకుంటూ స్త్రీ పురుషులు సమానంగా ఎదగాలన్నారు.టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ మాట్లాడారు. కవి సమ్మేళనాలు అలరించాయి. పలువురు రచయిత్రులు రచించిన పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుతులను అందజేశారు. నరసం జిల్లా అధ్యక్షులు కా.వెం. సుబ్బలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీ దేవి, సభ్యులు పసుపులేటి నీలిమ, చంద్రమౌళిని, హైమావతి, కవులు, రయితలు హరికిషన్, అజీజ్, లక్ష్మయ్య, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, ఎలమర్తిరమణయ్య పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ పరీక్ష


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి

కర్నూలు కల్చరల్: ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. కర్నూలు గ్రూప్‌లోని 9 ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్, 28 ఆంధ్ర బెటాలియన్ కేడెట్స్‌కు ఆదివారం మెడికల్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో సీ సర్టిఫికెట్‌కు సంబంధించి థియరీ, ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. 322 మంది బాయ్స్ కేడెట్స్, 340 గర్ల్స్ కేడెట్స్ పరీక్షకు హాజరయ్యారు. కర్నూలు ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీ సర్టిఫికెట్ కలిగిన వారు మిగతా వారి కంటే ఎక్కువ ప్రయోజనాలు పొందుతారన్నారు. అన్ని యూనిఫాం సర్వీసుల్లో చేరేందుకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. సాఫ్ట్‌వేర్, మెడిసిన్, ఐటీ, సివిల్ సర్వీసెస్‌లకు సంబంధించి కానీ ఏదైనా కంపెనీ ఇంటర్వ్యూలకు వెళ్లినప్పుడు ఎన్‌సీసీ హోల్డర్‌కు ప్రాధాన్యత ఇస్తారన్నారు. ఆయనతో పాటు 9 ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ గ్రూప్ కమాండింగ్ ఆఫీసర్ జోబి ఫిలిప్, 28 ఆంధ్ర బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్, సెంట్రల్ అబ్జర్వర్ కల్నల్ పార్మర్ ఉన్నారు.

కేఆర్ఎంబీ ఏర్పాటుపై సీఎం నిర్లక్ష్యం

- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు


మాట్లాడుతున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

కర్నూలు న్యూసిటీ: కర్నూలులో కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) ఏర్పాటుపై సీఎం చంద్రబాబు నాయుడు నిర్లక్ష్యం వహిస్తున్నారని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు విమర్శించారు. కర్నూలు నగరం బళ్లారి చౌరస్తాలోని ఒక హోటల్‌లో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాయలసీమలో ఉపాధిలేక పేద ప్రజలు వలస పోతుంటే సీఎం చంద్రబాబు అమరావతిలో 47 అంతస్తుల ఐకానిక్ భవనాలు నిర్మించి ఎన్ఆర్ఐలకు అమ్ముతామని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. 2018లో గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణానికి పాలన అనుమతులు ఇచ్చిన బాబు ఇప్పుడు దానే ఊసే ఎత్తక పోవడం దారుణమన్నారు. అనంతరం రాయలసీమ సాధన సమితి నాయకులు బొజ్జా దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో చంద్రబాబు నియంత పాలన సాగిస్తూ రైతుల హక్కులను కాలరాస్తున్నారన్నారు. రాయలసీమ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణను విస్మరించి వ్యవసాయాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సాగునీటి ప్రాజెక్టులపై అఖిలపక్షాలతో చర్చించకుండా ప్రభుత్వం సొంత నిర్ణయాలతో స్వలాభం కోసం అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో కర్నూలు ఏర్పాటైన జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, లోకాయుక్త, మానవ హక్కుల సంఘం కార్యాలయాలను అమరావతికి తరలిస్తుండటం సీమకు ద్రోహం చేయడమేన్నారు. వాటిని ఇక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కడపలో ఉన్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అక్కడే కొనసాగించాలని అన్నారు. కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి అనంతపురం జిల్లా నాయకులు రాంకుమార్, రైతు సంఘం నాయకులు, రామకృష్ణ, రామచంద్రారెడ్డి, మందా జగన్నాథం పాల్గొన్నారు.

తండ్రిని హతమార్చిన తనయుడు


నారాయణ (ఫైల్)

ఓర్వకల్లు: మద్యం మత్తులో ఓ యువకుడు సొంత తండ్రినే హతమార్చిన ఘటన మండలంలోని నన్నూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని దళిత కాలనీకి చెందిన గార్దుల రాములమ్మ, నారాయణ(50)కు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కూతురికి పెళ్లి చేశారు. కాగా తమకు ఉన్న 3 ఎకరాల భూమిని విక్రయించాలని పెద్ద కుమారుడు నవీన్ కొంతకాలంగా తండ్రిపై ఒత్తిడి తెస్తున్నాడు. సరైన ధర రాకపోవడంతో తండ్రి విక్రయించకుండా కాలయాపన చేస్తూ వస్తున్నాడు. ఈక్రమంలో కుటుంబంలో గొడవలు ఏర్పడ్డాయి. దీంతో గత ఏడాది నవీన్ తన తండ్రి నారాయణ చెవిని కొరికి గాయపరిచాడు. అప్పటి నుంచి తండ్రి, కుమారిడికి తరచూ గొడవలు జరుగుతూనే ఉన్నాయి. సాయంత్రం పూటుగా మద్యం తాగిన నవీన్.. తండ్రితో గొడవకు దిగాడు. మద్యం మత్తులో కర్రతో తలపై మోది, బండ రాయితో ముఖంపై కొట్టడంతో నారాయణ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సీఐ చంద్రబాబునాయుడు, ఎస్ఐ సునీల్ కుమార్, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. నారాయణ మృదేహాన్ని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సనీల్ కుమార్ తెలిపారు.

ఎస్టీ రిజర్వేషన్ కోసం పోరాడతాం

- ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదన్

కర్నూలు న్యూసిటీ: వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ కోసం పార్టీలకు అతీతంగా పోరాడతామని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ తెలిపారు. బళ్లారి చౌరస్తాలోని ఓ హోటల్‌లో న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళం–ప్రజాపతినిధుల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని 70 ఏళ్లుగా పోరాడుతున్నామన్నారు. వాల్మీకుల బలగం వల్లే తమకు ఈ రాజకీయ పదవులు లభించాయన్నారు. కులానికి న్యాయం చేయాలనేదే తమ జీవిత ఆశయమన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాలలో శాసన మండలిలో వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్లపై చర్చించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి మాట్లాడుతూ ప్రస్తుతం వాల్మీకులు నలుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఉండడం గర్వకారణమన్నారు. రాబోయే రోజుల్లో మరింత మంది రాజకీయంగా ఎదిగేలా కృషి చేయాలన్నారు.

13 టిప్పర్లు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

బనగానపల్లె రూరల్: బనగానపల్లె ప్రాంతం నుంచి పలు చోట్లకు అధిక మోతాదులో సుద్ద పౌడర్‌ను రవాణా చేస్తున్న 13 టిప్పర్లను స్వాధీనం చేసుకునట్లు ఎస్ఐ దుగ్గిరెడ్డి ఆదివారం తెలిపారు. బేతంచర్ల రోడ్డు, యాగంటిపల్లె రోడ్లపై వాహనాలను తనిఖీ చేస్తుండగా సుద్ద పౌడర్ టిప్పర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని, వీటిని మైనింగ్ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికెన్ సెంటర్లు వెలవెల!

- 10 శాతానికి పడిపోయిన చికెన్ విక్రయాలు
- ధరలు తగ్గించినప్పటికీ చికెన్‌పై ఆసక్తి చూపని వినియోగదారులు
- మటన్, చేపలకు భారీగా పెరిగిన డిమాండ్
- అడ్డగోలుగా మటన్ ధరల పెంపు


వినియోగదారులు రాక బోసిపుతున్న చికెన్ సెంటరు

కర్నూలు(అగ్రికల్చర్): బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్‌తో చికెన్ సెంటర్లు వెలవెలబోతున్నాయి. కర్నూలులో ఒక్క ఎన్ఆర్ పేటలోనే కాదు.. నగరమంతా చికెన్ విక్రయాలు 10 శాతానికి పడిపోయాయి. కర్నూలు నగరంలో దాదాపు 200 వరకు చికెన్ సెంటర్లు ఉన్నాయి. సగటున ఒక్కో చికెన్ సెంటరు ద్వారా 200– 300 కిలోల వరకు అమ్మకాలు జరుగుతాయి. ఈ ప్రకారం నగరం మొత్తం మీద దాదాపు 6,000 కిలోల వరకు చికెన్ అమ్మకాలు ఉంటాయి. అయితే బర్డ్‌ఫ్లూ వెలుగు చూసిన తర్వాత ఆదివారం చికెన్ అమ్మకాలు 10 శాతానికి పడిపోయాయి. దీంతో పౌల్ట్రీ రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. చికెన్/గుడ్లను 100 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద ఉడికించి తినవచ్చని అధికారులు ప్రచారం చేస్తున్నప్పటికీ వినియోగదారుల్లో బర్డ్‌ఫ్లూ భయం పోవడం లేదు. కర్నూలులో చికెన్ కిలో ధర రూ.200/220 ఉండగా.. ఇతర ప్రాంతాల్లో రూ.150–180కి తగ్గించారు. అయినా వినియోగదారులు ఆసక్తి చూపడంలేదు. ఈక్రమంలో మాంసం, చేపలకు డిమాండ్ పెరిగింది. మటన్ కిలో ధర రూ.800/840 ఉండగా.. తాజాగా రూ.900/1000 పెంచేశారు. అయినా మటన్ అమ్మకాలు మూడు రెట్లు పెరిగాయి. చేపల అమ్మకాలు నాలుగైదు రెట్లు పెరిగాయి.

6 కిలోలే విక్రయించాం



గత ఆదివారం 220 కిలోల చికెన్ విక్రయించాం. ఈ ఆదివారం చికెన్ అడిగే వారే లేరు. కేవలం మూడు కోళ్లు మాత్రమే కోసి ఆరు కిలోల చికెన్ విక్రయించాం. ఇంత దయనీయమైన అమ్మకాలు ఎప్పుడూ లేవు. కర్నూలులో బాతులకు మాత్రమే బర్డ్‌ఫ్లూ వచ్చింది. కోళ్లకు ఎలాంటి బర్డ్‌ఫ్లూ లేదు. కోళ్లలో మరణాలు కూడా లేవు. తగిన జాగ్రత్తలతో చికెన్ నిర్భయంగా తినొచ్చు. కానీ వినియోగదారులు మాత్రం భయపడుతున్నారు.

– కిశోర్ యాదవ్, చికెన్ సెంటర్ నిర్వాహకుడు వెంకటరమణ కాలనీ, కర్నూలు

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ కర్నూలు–కల్లూరు ముజఫర్ నగర్, శ్రీ నివాస నగర్‌లో ప్లాటు నెం: 29 తూర్పు ఫేస్ 4.5 cents 37x53 అమ్మబడును. సంప్ర: 9652422779. [L-794742]

TO - LET

■ GODOWN 1KSFT to 50KSFT Old House at King Market, Opp: Padmavathi Apartment, Near King Market, Kurnool. Cell: 9396647848. [L-794790]

■ LAND REQUIRED కర్నూలు, నంద్యాల పరిసర ప్రాంతాలలో కమర్షియల్ & రెసిడెన్సియల్ ప్రాజెక్ట్ డెవలప్మెంట్‌కు అనువైన స్థలం కావలెను. Revcon Developers, సెల్ : 8885559435 [C-1268826]

HOUSE FOR SALE

■ కర్నూలు సిటీ, బిర్లా గేట్ నుండి కేవలం 1.5 కి.మీ దూరంలో దిన్నెదేవరపాడు రోడ్డుకు 30x45 సైజు గల ఇండిపెండెంట్ హౌసెస్ ఆర్ఆర్ హోమ్స్ నందు అమ్మకానికి కలవు. © 9000670038. [L-794744]

SERVICES

MARRIAGE SERVICES

■ అన్ని కులాల, బిజినెస్, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ టీచర్స్, బ్యాంక్, పోస్టల్, రైల్వే, పోలీస్, సచివాలయం, డాక్టర్ సంబంధాలు కలవు. స్టార్ మ్యారేజ్ బ్యూరో, నంద్యాల. 8790844959.(2వ సంబంధాలు కలవు). [L-794741]

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6670]

WANTED

■ Telecallers (girls) Qly : degree Salary: 15k (with incentive), Adress: ballary chowrastha, skandhanshi complex D Mart beside. kurnool. Cont: 9966308080, 9391220645. [SCA25001667]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663 [HA-1901]

■ కష్టలెస్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు – 40 వేలు, ఫ్రీ రూం+భోజనం. HYD. 7995365999 [HA-99864]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

